సాక్షి
శ్రీకాకుళం
సోమవారం । 30 । అక్టోబర్ । 2023



చిన్నారి ప్రాణాలకు ఆపద

కవల పిల్లలు బోన్‌మేరో వ్యాధి బారిన పడ్డారు. వీరి చికిత్స కోసం తల్లిదండ్రులు సాయం కోరుతున్నారు. - 8లో



ఇసుక బండిని ఢీకొట్టి..

చీకటిలో ఇసుక బండిని ఢీకొట్టి ఓ యువకుడు మృతి చెందారు. శ్రీకాకుళంలో ఘటన జరిగింది. - 8లో



శివసాగర్ తీరంలో పర్యాటకుల సందడి

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. దీంతో ముందుగానే కార్తీక శోభ తీరంలో కనిపించింది. ఆదివారం కావడంతో పర్యాటకులు తీరానికి చేరుకుని సహపంక్తి భోజనాలు చేశారు.

న్యూస్‌రీల్

సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులకు చికిత్స



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

విజయనగరం: రైలు ప్రమాదంలో గాయపడి విజయనగరం సర్వజన ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న క్షతగాత్రుల వివరాలు.. ముర్రు వెంకటరావు, ముర్రు లక్ష్మి(తురువోలు), మర్రాపు సూర్యనారాయణ (పణుకవలస), రెడ్డి రాము (ఎం.అలమండ), దుంగల అమ్మాజీ (నాయుడు పాలేం), బి.గజ్జలనాయుడు(వెంకటరాజు పాలేం), జె.బంగారుతల్లి, మజ్జి అమృత(జి.సిగడాం), మజ్జి మోక్ష , మజ్జి సూర్యకాంతం, మజ్జి రమణ, కీర్తి రాములమ్మ, టంకాల సుగణమ్మ(మెట్టవలస), జి.మహాలక్ష్మినాయుడు, పి.గౌరునాయుడు (కాపు సంభాం), రెడ్డి శంకర్ (రెడ్డి పేట), నల్ల కుమారి (అలమండ), జి.మురళి, జి.ప్రభావతి (కొండ లక్ష్మీపురం), ప్రణితి, జ్ఞానేశ్వరి (కొండ లక్ష్మీపురం), ఎస్.పార్వతి, ఎం.తిరుపతిరావు, కామేశ్వరావు, సవర బుజ్జి, సవర రాయప్ప (పాలకొండ), మహంతి ఆదిలక్ష్మి, తేజ (జి.సిగడాం), కె.రమణచారి, జె.కృష్ణ, జె.మిశ్రా, జె కోమలిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే విధంగా తిరుమల మెడికవర్‌లో ఇద్దరు, ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో ఒకరు చేరారు.

1న అండర్-19 బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: నవంబర్ 1న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-19 బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామన్న చెప్పారు. వివరాలు దుప్పలవలసలో వెల్లడించారు. శ్రీకాకుళం పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు ఈ ఎంపికలు ఉంటాయని చెప్పారు. ఆసక్తిగల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 63025 46128ను సంప్రదించాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు రక్షణ కల్పించాలి



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా చేస్తున్న ఈయూ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: నెల్లూరు జిల్లా కావలిలోని ఆటోనగర్ డిపో బస్సు డ్రైవర్ రాంసింగ్‌పై దాడికి పాల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బస్ డ్రైవర్‌పై దాడికి నిరసనగా ఆదివారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈయూ నాయకులు మాట్లాడుతూ ఆన్‌డ్యూటీలో ఉన్న డ్రైవర్ రాంసింగ్‌పై దాడికి పాల్పడిన 14 మంది దుండగులను వెంటనే పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేయాలన్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేసే ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలన్నారు.

వెంకటేశ్వర ఆలయ నిర్మాణానికి రూ.1.18 లక్షల వితరణ



పాపయ్యరెడ్డికి నగదు అందిస్తున్న చింతామణిట్రస్టు ప్రతినిధి శేఖర్ తదితరులు

కవిటి: హైదరాబాద్‌కు చెందిన చింతామణి అమ్మవారి ట్రస్టు (కవిటి) సంస్థ అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమైనవని మాజీ సర్పంచ్ బెందాళం వేంకటేశ్వరరావు, పి.శేఖర్, ఎ.మధుబాబు అన్నారు. ఆదివారం కవిటిలో నూతనంగా నిర్మిస్తున్న వెంకటేశ్వర ఆలయం నిర్మాణానికి చింతామణి ట్రస్టు ద్వారా రూ.1.18 లక్షల ఆర్థిక సాయం వితరణగా అందించినట్టు ట్రస్టు ప్రతినిధి పి.శేఖర్ తెలిపారు. ఈ మేరకు నగదు ఆలయ నిర్మాణకర్త పాపయ్యరెడ్డికి అందించారు. కవిటికి చెందిన బెందాళం రమణ, మొగిలిపురి శీతారాం, పొల్లాయి లక్ష్మణమూర్తి, పులకల వెంకటరావు, బావన రవి, తమరాల జయరాం , కొర్ల ముకుందరావు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై రక్తపు మరక



ధ్వంసమైన బోగీల వద్ద సహాయక చర్యలు

రాత్రి పూట కొన్ని బతుకులు తెల్లారిపోయాయి. రైలు పట్టాలపై దారి కాచిన మృత్యువు బారిన పడి కొందరి ప్రయాణాలు శాశ్వతంగా ఆగిపోయాయి. అంతవరకు కబుర్లు, కాలక్షేపాలతో సందడిగా కనిపించిన రైలు బోగీలు ఆర్తనాదాలతో నిండిపోయాయి. రైలును భారంగా మోస్తున్న పట్టాలకు రక్తపు మరకలు అంటుకున్నాయి. విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదంతో జిల్లా ఉలిక్కిపడింది. ఈ ప్రమాద బాధితుల్లో జిల్లా వాసులూ ఉన్నారు.

- విజయనగరం జిల్లాలో పలాస పాసింజర్‌ను ఢీకొట్టిన రాయగడ పాసింజర్
- మృతులు, క్షతగాత్రుల్లో సిక్కోలు వాసులు
- రాత్రంతా కొనసాగిన సహాయక చర్యలు



ప్రమాద ఘటన ఊహా చిత్రం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం, జి.సిగడాం: విజయనగరం జిల్లా కొత్తవలస మండలం కంటకాపల్లి-చినరావుపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో శ్రీకాకుళం జిల్లా వాసులు చిక్కుకున్నారు. ఓవర్‌హెడ్ కేబుల్ తెగిపోవడంతో నిలిచిపోయిన విశాఖ-పలాస రైలును వెనక నుంచి వస్తున్న విశాఖ-రాయగడ పాసింజర్ ఢీకొట్టడంతో భారీ ప్రమాదం సంభవించింది. ఇందులో పలాస పాసింజర్ రైలుకు చెందిన వెనక మూడు బోగీలు ప్రమాదానికి గురయ్యాయి. ఈ బోగీల్లో శ్రీకాకుళం జిల్లా వాసులు ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. కడపటి సమాచారం మేరకు జి.సిగడాం మండలం ఎస్పీఆర్‌పురం గ్రామానికి చెందిన గిడిజాల లక్ష్మి(43) మృతి చెందారు.

ఈ ప్రమాదంతో శ్రీకాకుళం జిల్లా మరోసారి ఉలిక్కిపడింది. ఆ మధ్య ఒడిశాలో కోరమండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదానికి గురైనప్పుడు మన జిల్లాకు చెందిన ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డ విషయం తెలిసిందే. వాస్తవానికి ఆ ప్రమాదానికి గురైన రైలు మన జిల్లాలో హాల్ట్ లేకపోవడంతో భారీ ప్రాణ నష్టం తప్పింది. అయితే తాజాగా ప్రమాదానికి గురైన విశాఖ-పలాస పాసింజర్‌కు జిల్లాలో హాల్ట్‌లు ఎక్కువ. దీంతో బాధితుల్లో జిల్లా వాసులే అధికంగా ఉండొచ్చని భావిస్తున్నారు. పాసింజర్ రైలు కావడంతో క్షతగాత్రుల వివరాలు తెలుసుకోవడం కష్టంగా మారుతోంది.



ప్రమాదంలో మృతి చెందిన గిడిజాల లక్ష్మి

శుభ కార్యానికి వెళ్లి..

జి.సిగడాం మండలం ఎస్పీఆర్‌పురానికి చెందిన గిడిజాల లక్ష్మి (43) ఓ శుభకార్యం నిమిత్తం వైజాగ్ వెళ్లారు. ఈమెతో పాటు 15 మంది వెళ్లారు. ఫంక్షన్ అయిపోయిన తర్వాత తిరిగి వచ్చేందుకు విశాఖ-పలాస రైలును ఎక్కారు. వీరిలో 14మంది ఇంజిన్ వెనకున్న మూడో బోగీలో ఎక్కగా, గిడిజాల లక్ష్మీ మాత్రం చివరి బోగీలో ఎక్కారు. రాయగడ పాసింజర్ రైలు ఢీకొట్టడంతో ఆఖరు బోగీలో చిక్కుకుపోయిన ఆమె మృతి చెందారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అలాగే జి.సిగడాం మండలం మెట్టవలస గ్రామానికి చెందిన డెంకాడ అప్పన్నమ్మ ఇదే ప్రమాదంలో గాయాలపాలైంది. జి.సిగడాం గ్రామానికి చెందిన కీర్తి రాములమ్మకు రెండు కాళ్లు విరిగిపోయాయి. అమృత, రమణ, సూర్యకాంతం, మోక్షలకు తీవ్ర గాయాలయ్యాయి. టంకాల సుజనమ్మ ఒక్క కాలు విరిగిపోయింది. వీరు కొత్తవలస ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

భారీ శబ్దం.. గాల్లో బోగీలు..



ప్రత్యక్ష సాక్షి కథనం

నేను సింహాచలం స్టేషన్‌లో పలాస పాసింజర్ ట్రైన్ ఎక్కాను. ఆరుగంటలకు రావాల్సిన ట్రైన్ 6.15కి వచ్చింది. నార్త్ సింహాచలం, పెందుర్తి, కొత్తవలస, కంటకాపల్లి స్టేషన్‌లు దాటాం. అక్కడకు 10 నిమిషాల వ్యవధిలో ఒక్కసారిగా పెద్ద శబ్దం. నేను చివరి నుంచి నాలుగో బోగీలో ఉన్నా. మా బోగీ ఒరిగి పక్క ట్రాక్ మీద ఉన్న గూడ్స్ ట్రైన్‌కు ఆనుకుని ఉండిపోయింది. మా తర్వాత 3 బోగీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆ బోగీల్లో చాలా వరకు చిన్నారులు, మహిళలు, భవన నిర్మాణ కార్మికులు ఉన్నారు. బోగీల్లో చిక్కుకున్న 15 మంది మహిళలు, చిన్నారుల్ని సురక్షితంగా బయటకు తీసుకొచ్చి సపర్యలు చేశా. పెద్ద ప్రమాదమే. నేను వ్యాపార పనుల కోసం వారంలో మూడు రోజులు ఇదే ట్రైన్‌కు వెళ్లి వస్తుంటా. - కిరణ్ కుమార్ పాత్రో, మాజీ సైనికుడు, పలాస

పలాసలో హెల్ప్‌డెస్క్



కాశీబుగ్గ: విశాఖపట్నం-పలాస పాసింజర్ ప్రమాదంతో ఈస్ట్ కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ అధికారులు స్పందించి పలాస రైల్వేస్టేషన్‌లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశారు. ప్రయాణికుల కుటుంబాలు, బంధువులు 06742492245 06742490555 06742534027 9090522120, 8917387241, 9040277587, 8895670954 నంబర్లను సంప్రదించాలని పలాస రైల్వేస్టేషన్ మేనేజర్ తెలిపారు.

ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో..

ఆమదాలవలస: రైలు ప్రమాద ఘటనకు సంబంధించి శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస)లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. సహాయ సంప్రదింపుల కోసం 0891-2885911, 0891-2885912, 0891-2885913, 0891-2885914, 08942286245, 08942286213 నంబర్లకు కాల్ చేసుకోవచ్చని సూచించారు.



జి.సిగడాం: తీవ్రంగా గాయపడిన మెట్టవలస వాసి డెంకాన అప్పన్నమ్మ

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు

కాశీబుగ్గ: విజయనగరం జిల్లాలో జరిగిన రైలు ప్రమాదం నేపథ్యంలో సహాయక చర్యలు చేపడుతున్నట్లు ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. ఈ సందర్భంగా 30వ తేదీ సోమవారం పలు రైళ్లను రద్దు చేస్తున్నామని, మరికొన్ని రైళ్లను దారి మళ్లిస్తున్నామని డీఆర్ఎం కార్యాలయం ఖుర్దా నుంచి ప్రకటన విడుదలైంది. రద్దయిన రైళ్లలో రాయ్‌పూర్-విశాఖపట్నం (08527), విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528), భువనేశ్వర్-ముంబై (11020)(స్వల్పమార్పు), ముంబై- భువనేశ్వర్ (11019)(స్వల్పమార్పు), 20809, 17479, 07468 నంబర్ గలవి ఉన్నాయి. అలాగే దారి మళ్లించిన రైళ్లు బరౌని-కోయంబత్తూరు (03357), టాటా-ఎర్నాకులం (18189), భువనేశ్వర్-ముంబాయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), హౌరా -సికింద్రాబాద్ (12703), హౌరా బెంగుళూర్ (12245).



సంఘటన స్థలంలో స్థానికుల సహాయక చర్యలు

ఆ దృశ్యాలు.. అదృశ్యం కావేమో..!

13 — 2013: విజయనగరం జిల్లా బొండపల్లి మండలం గొట్లాం వద్ద రైలు నుంచి పొగలు వస్తున్నాయని చైను లాగి ప్రయాణికులు పట్టాలు దాటి పరిగెడుతుండగా పక్క ట్రాక్‌పై వస్తున్న మరో రైలు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో 13 మంది చనిపోయారు.

40 — 2017 జనవరి: పార్వతీపురంలోని కూనేరు వద్ద జరిగిన ఘటనలో 40 మంది ప్రయాణికులు మృతి చెందారు.

5 — 2022: జి.సిగడాం మండలం బాతువ వద్ద కోయంబత్తూరు రైలు నుంచి పొగలు వస్తుండటంతో ప్రయాణికులు రైలు చైను లాగి పక్క ట్రాక్‌పైకి పరుగెత్తారు. అదే సమయంలో అటు నుంచి వస్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఢీకొనడంతో ఐదుగురు ప్రయాణికులు చనిపోయారు.

275 — 2023 జూన్: ఒడిశాలో జరిగిన కోరమండల్ రైలు ప్రమాదంలో 275 మందికి పైగా ప్రయాణికులు మృతిచెందారు.

'స్కిల్ స్కామ్ సూత్రధారి చంద్రబాబే'



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సరుబుజ్జిలి: స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ప్రధాన సూత్రధారి నారా చంద్రబాబునాయుడేనని స్పీకర్ తమ్మినేని సీతారాం పునరుద్ఘాటించారు. మండల కేంద్రంలో ఆదివారం సచివాలయం, ఆర్‌బీకేల ప్రారంభం అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనంతో మాత్రమే పొత్తుపెట్టుకొని 175 స్థానాల్లో విజయఢంకా మోగిస్తారని అన్నారు. టీడీపీ ఏజెంట్లకు కూడా పథకాలు అందించాలని చెప్పిన నేత వైఎస్ జగన్ అని అన్నారు. భువనేశ్వరి చెబుతున్నట్లు నిజమే గనుక గెలిస్తే చంద్రబాబు శాశ్వతంగా జైలులో ఉండక తప్పదని అన్నారు. శిలాఫలకంపై సీఎం వైఎస్ జగన్ ఫొటో లేదని అధికారులను అడిగితే టీడీపీ నేతలకు నేరంలా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. వెన్నెలవలసలో కూనవారి పూలతోటపేరుతో 99 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించడానికి చూసిన మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ అభివృద్ధి కోసం మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ ఎస్.నాగేశ్వరరావు, బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా సంప్రోక్షణ



శ్రీముఖలింగం ఆలయంలో సంప్రోక్షణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



ఆదిత్యాలయ ప్రధాన తలుపులు తీస్తున్న ప్రధానార్చకులు శంకరశర్మ

అరసవల్లి: పాక్షిక చంద్రగ్రహణం వీడిన అనంతరం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక సంప్రోక్షణ, శుద్ధి కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రహణానంతరం ఆదివారం ఉదయం 7 గంటల్లోపే ఆలయంలోపల గర్భాలయం, అంతరాలయం, బేడా మండపం, మహా మండపం , క్షేత్రపాలక సన్నిధి, నవగ్రహ సన్నిధితో పాటు ఉషా, ఛాయా, పద్మిని మండపాలు, అనివేటి మండపాలన్నీ శుద్ధి చేశారు. అనంతరం 7 గంటల నుంచి సర్వదర్శనాలకు అనుమతించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం రూ.1.60 లక్షల వరకు ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు.

శ్రీకూర్మనాథాలయంలో..

గార: పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా శ్రీకూర్మనాథాలయాన్ని శనివారం సాయంత్రం మూసివేయగా, ఆదివారం ఉదయం తెరిచారు. ముందుగా ఆలయంలో శాస్త్రోక్తంగా సంప్రోక్షణ నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు మురళీకృష్ణమాచార్యులు, కిషోర్‌బాబులు సంప్రోక్షణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్రీముఖలింగంలో..

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో చంద్రగ్రహణం అనంతరం ఆదివారం ఉదయం అర్చకులు సంప్రోక్షణ, శుద్ధి పూజలు నిర్వహించారు. పుణ్య నదీ జలాలతో స్వామివారి విగ్రహాలకు, ఆలయం చుట్టూ ఉన్న వివిధ దేవాతా విగ్రహాలకు శుద్ధి కార్యక్రమం చేపట్టారు. వారాహి అమ్మవారికి, భీమేశ్వర, సోమేశ్వర ఆలయాల్లో కూడా సంప్రోక్షణ నిర్వహించారు.

రావివలసలో..

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. శుద్ధి. ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేకాలు చేశారు.

ఎంపీకి విమర్శించే అర్హత లేదు

- మంత్రి సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: ఎంపీ హోదాలో పదేళ్లుగా స్టీలు కుర్చీలు వేయించడం తప్ప ఇంకేం చేయని రామ్మోహన్ నాయుడికి తనను విమర్శించే అర్హత లేదని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. పలాసలో వచ్చే నెల 3న సామాజిక సాధికార యాత్ర నిర్వహించనున్న నేపథ్యంలో.. పలాస మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం మంత్రి సీదిరి అప్పలరాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ ఆశీర్వాదంతో ఎన్నో ప్రాజెక్టులు పూర్తి చేశామని, రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్, రూ.700 కోట్లతో వాటర్ గ్రిడ్, రూ.100 కోట్లతో మున్సిపాలిటీ తాగునీరు, డిగ్రీ కళాశాల, మండలానికి జూనియర్ కళాశాల, అన్ని మండల కేంద్రాల్లో రోడ్ల విస్తరణ పనులు, మున్సిపాలిటీ విస్తరణ పనులు ఇలా అన్ని చేసుకుంటూ వచ్చామని వివరించారు. ఎంపీ ఇక్కడకు వస్తే అన్నీ దగ్గరుండి చూపిస్తామన్నారు. ఫొటోలు సైతం ప్రదర్శిస్తున్నామని కళ్లు తెరిచి చూడాలని సూచించారు. నవంబర్ 3న నిర్వహించనున్న బస్సు యాత్రతో ప్రతిపక్షాల గుండెలో రైళ్లు పరిగెత్తేలా చూడాలన్నారు.

అంతకు ముందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడారు. ఎన్ని పార్టీలు ఏకమైనా వైఎస్ జగన్‌ను ఓడించలేరని, ఆయన జనం మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించారని అన్నారు. ప్రజల అవసరాలు తెలుసుకుని వాటిని సీఎం తీరుస్తున్నారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం అన్ని రంగాలకూ చేయూత అందిస్తున్నారని తెలిపారు. ఏ ప్రాంతానికి ఏం కావాలో గుర్తిస్తున్నారని.. అందులో భాగంగానే ఉద్దానానికి కిడ్నీ రీసెర్చ్ సెంటర్, వాటర్ గ్రిడ్ అవసరమని గుర్తించి అందించారని అన్నారు. ఇలాంటి సమర్థుడైన నాయకుడి వెంట నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, ఎంపీపీలు డొక్కరి దానయ్య, ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, ఉంగ సాయిప్రవీణ, జెడ్పీటీసీలు సవర రత్నాలు, హనుమంతు వెంకటరావుదొర, పానిల శ్రీనివాసరావు, మచ్చ ధనరావు, పీవీ సతీష్, రాపాక చిన్నారావు, మరడ భాస్కరరెడ్డి, బోర బుజ్జి, మీసాల సురేష్, డబ్బీరు భవానీ, పైల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ మాటు వేసిందో..?



పుక్కళ్లపాలెం సీహెచ్‌కపాసుకుద్ది మధ్య తీరం వెంబడి పులి అడుగులు గుర్తించిన అధికారులు

కవిటి: కవిటి ఉద్దానం ప్రాంతంలో పెద్దపులి కలియ తిరుగుతోంది. అటవీ శాఖాధికారులు పాదముద్రలు గుర్తిస్తూ దాని కదలికలను గమనిస్తున్నారు. మొట్టమొదట బెజ్జిపుట్టుగ నాయుడుగారి వీధిమార్గంలో అడుగులు గుర్తించారు. అక్కడ నుంచి పరిశీలిస్తూ వచ్చాక జగతిలో కొబ్బరి తోటల్లోనూ, తర్వాత కవిటి కొత్తూరు కొబ్బరితోటల్లోనూ, ఆ తర్వాత పుక్కళ్లపాలెం సముద్రతీరం గ్రామ పరిసరాల్లోనూ పెద్దపులి అడుగుల జాడను గుర్తించారు. అటుపై సీహెచ్ కపాసుకుద్ది వైపు పులి వెళ్లి ఉంటుందని భావించి ఆ దిశగా పాదముద్రలను పరిశీలించినా ఎక్కడా కనిపించలేదు. దీంతో ఈ పెద్దపులి పుక్కళ్లపాలెం, సీహెచ్‌కపాసుకుద్ది గ్రామాల మధ్య దట్టమైన సరుగుడు తోటల్లో మాటువేసి ఉంటుందని అనుమానిస్తున్నారు. అక్కడ చిన్నపాటి నీటికొలను కూడా ఉండడంతో దానికి సమీపంలోనే ఉండవచ్చనే అంచనా వేస్తున్నారు. దీంతో సీహెచ్ కపాసుకుద్దిలో ప్రజలు తీరానికి వెళ్లవద్దని టాంటాం వేశారు. ఇంతవరకు పెద్దపులి ఎక్కడా దాడి చేసిన దాఖలాలు కనిపించలేదు. ఇదే అటవీ శాఖాధికారులను భయపెడుతోంది. ఆకలితో ఉన్న పులి ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారి సెక్షన్ ఆఫీసర్ రామినేని రాఘవయ్య, సిబ్బంది పులి అడుగుజాడలను గమనిస్తున్నారు.

క్లుప్తంగా

చెరువులో పడి వ్యక్తి మృతి

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెం సమీపంలో గల చెరువులో పడి పెదగాపు రాంబాబు(38) అనే వ్యక్తి మృతి చెందారు. జేఆర్ పురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. విశాఖపట్నంలో పని చేస్తున్న రాంబాబు స్వగ్రామం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని వల్లూరు వెళ్లేందుకు రణస్థలంలో ఈ నెల 26వ తేదీన దిగారు. అక్కడి నుంచి మద్యం మత్తులో 3 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి నడుకుదిటిపాలెం చెరువులో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు పోలీసులు చెబుతున్నారు. నాలుగు రోజుల తర్వాత ఆదివారం మధ్యాహ్నం మృతదేహం నీటిపై తేలడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వల్లూరు నుంచి కుటుంబ సభ్యులు వచ్చిన తర్వాత కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు. ఎస్ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో యువకుడు ఆత్మహత్య



కాశీబుగ్గ స్వప్నలాడ్జిలో ఆత్మహత్య చేసుకున్న ఢిల్లీ యువకుడు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాశీబుగ్గ కేటీ రోడ్డులో ఉన్న స్వప్నలాడ్జిలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మృతుడిని ఢిల్లీకి చెందిన రాజ్‌పుత్ నరేష్ అలియాస్ నగేష్(25)గా గుర్తించారు. అతను శనివారం స్వప్న లాడ్జిలో దిగాడు. ఆదివారం ఉదయం ఎంత సేపటికీ బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి లాడ్జి సిబ్బంది చూసే సరికి ఉరి వేసుకున్నట్లు కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. కాశీబుగ్గ ఎస్ఐ షరీఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన ఏపీజీఈఎఫ్ కార్యవర్గం

కాశీబుగ్గ: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఏపీజీఈఎఫ్) జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక కాశీబుగ్గలో సూర్యతేజ కళాశాలలో ఆదివారం జరిగింది. అధ్యక్షులుగా తమ్మినాన చందనరావు, కార్యదర్శిగా సీహెచ్ శరత్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటుగా వివిధ కేటగిరీల కార్యవర్గంలో మరో ఇరవై మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పినకాన వాళి, దానేటి కామేశ్వరరావు, ఉర్నాన అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్ని ప్రాణాలకు ఆపద

- బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు
- చికిత్స చేయించలేకపోతున్న తల్లిదండ్రులు
- దాతలు కరుణించాలని తల్లిదండ్రుల వేడుకోలు

ఇచ్ఛాపురం రూరల్: పదమూడు నెలల వయసు. చూడగానే ముద్దొచ్చే రూపం. వారి అల్లరిని చూస్తేనే కడుపు నిండిపోతుంది. ఇప్పుడిప్పుడే మాటలు నేర్చుకుంటున్నారు. ఈ ముద్దుగారే కవల పిల్లలు ప్రాణాల కోసం పోరాడుతున్నారు. ప్రాణాంతకమైన బోన్‌మేరో వ్యాధి సోకి చికిత్స కోసం ఎదురు చూస్తున్నారు. కూలి పనులు చేస్తే గానీ కడుపు నిండని స్థితిలో బిడ్డలకు చికిత్స చేయించలేక తల్లిదండ్రులు తల్లడిల్లిపోతున్నారు. దాతలు సాయం చేస్తే తమ బిడ్డల ప్రాణాలు దక్కుతాయని వేడుకుంటున్నారు.

ఇచ్ఛాపురం మండలం కేశుపురం గ్రామానికి చెందిన శివంగి కూర్మారావు, భూలక్ష్మికి రెండున్నరేళ్ల కిందట వివాహమైంది. పదమూడు నెలలు కిందట అమ్మాయి, అబ్బాయి కవలలుగా పుట్టారు. వీరికి హర్షిత, హర్షవర్ధన్ అని పేరు పెట్టుకున్నారు. ఉన్నంతలో పిల్లలను ముద్దుగా పెంచుకుంటున్నారు. అయితే ఆరు నెలల నుంచి ఇద్దరు చిన్నారుల ఆరోగ్య స్థితి అంతగా బాగుండడం లేదు. మేనరిక వివాహం వల్ల అనారోగ్య సమస్యలు వచ్చినట్లు వైద్యులు చెప్పారు. ఇటీవల హర్షవర్ధన్ నోరు, మల ద్వారం నుంచి రక్తస్రావం కావడంతో విశాఖపట్నం ఆంధ్రా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ వైద్యులు పరీక్షించి హర్షవర్ధన్ 'బోన్ మేరో' వ్యాధితో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం హర్షవర్ధన్ పరిస్థితి విషమంగా ఉండగా, పాప హర్షితకు కూడా వ్యాధి సోకవచ్చనే ఉద్దేశంతో వైద్యులు పరీక్షలు నిర్వహించడంతో తల్లిదండ్రులకు పిడుగులాంటి వార్త వినాల్సి వచ్చింది. ఇప్పుడిప్పుడే పాప హర్షితకు కూడా వ్యాధి సోకుతోందని, వెంటనే చెన్నైలో చికిత్స చేయాలని, అందుకు సుమారు ముప్పై లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులకు వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. తండ్రి కూర్మారావు మంగళూరులో ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇప్పటికే సుమారు ఐదు లక్షల వరకు ఖర్చయిందని, దాతలు స్పందిస్తే గానీ తాము చికిత్స చేయలేని స్థితిలో ఉన్నామని వారు చెబుతున్నారు. మనసున్న వారు స్పందించి తమ బిడ్డలకు ప్రాణభిక్ష పెట్టాలని అమ్మానాన్న కోరుతున్నారు. సాయం చేయాలనుకునే వారు 8074101661 నంబర్‌ను సంప్రదించాలని కోరుతున్నారు.



బోన్‌మేరో వ్యాధితో బాధపడుతున్న కవల పిల్లలు హర్షిత, హర్షవర్ధన్





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న హర్షవర్ధన్, హర్షిత

క్రీడలతో సమ సమాజ నిర్మాణం



తైక్వాండోలో చాంపియన్‌గా నిలిచిన టౌన్‌హాల్ బృందానికి టైటిల్ అందజేస్తున్న ధర్మాన కృష్ణదాస్ తదితరులు

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో ఒక మంచి సమసమాజ నిర్మాణం సాధ్యపడుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. క్రీడలను ప్రభుత్వాలతోపాటు దాతలు, పారిశ్రామిక వేత్తలు, ప్రైవేటు వ్యక్తులు ప్రోత్సాహించిన నాడే క్రీడల అభివృద్ధి జరుగుతుందని ఆయన చెప్పారు. కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్, తైక్వాండో చాంపియన్ షిప్-2023 పోటీలు ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో ఎంతో కన్నుల పండువలా జరిగాయి. ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి ధర్మాన ప్రసాదరావు తొలుత స్వర్గీయ కొన్న చిన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపోటముల కంటే.. పోటీల్లో ప్రాతినిధ్యం వహించడమే ముఖ్యమనే విషయాన్ని ఎన్నడూ మరవకూడన్నారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కొన్న చిన్నారావు కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. తమ తండ్రి కొన్న చిన్నారావు మెమోరియల్ పేరిట కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆప్తుల సహకారంతో గత 16ఏళ్లగా క్రీడాపోటీలను నిర్వహిస్తుండటం ఆనందంగా ఉందని కొన్న చిన్నారావు కుమారుడు, విశాఖపట్నం టౌన్ ప్లానింగ్ చీఫ్ ఆఫీసర్ కొన్న వెంకటేశ్వరరావు(వాసు) పేర్కొన్నారు. అనంతరం 600 మీటర్ల పరుగుపందెంను మంత్రి ధర్మాన ప్రసాదరావు జెండా ఊపి ప్రారంభించారు. ఆ తర్వాత కళాశాల సిల్వర్ జూబ్లీ ఆడిటోరియంలో తైక్వాండో పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలను నిర్వహించారు. అంతకుముందు డీఎస్పీ, నేషనల్ అథ్లెట్ డి.కోటేశ్వరరావును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

దాతల ప్రోత్సాహంతో క్రీడలు అభివృద్ధి

ప్రభుత్వాలతోపాటు దాతల ప్రోత్సాహం ఉంటేనే క్రీడలు మరింతగా అభివృద్ధి చెందుతాయని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కొన్న చిన్నారావు మెమోరియల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు, బహుమతుల కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన బాలబాలికలకు పతకాలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

చీకటిలోనే బతుకు తెల్లారిపోయింది

- ఎడ్ల బండిని ఢీకొట్టి యువకుడు మృతి
- నిబంధనలు పాటించని ఇసుక బండ్లు



స్పాట్‌లోనే మరణించిన పంచముఖేశ్వరరావు



పంచముఖేశ్వరరావు (ఫైల్)



చీకటిలో ఇసుక ఎడ్ల బండి

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళంలోని ఆదివారంపేట సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నగరానికే చెందిన గుసిరి పంచముఖేశ్వరరావు అలియాస్ శివ (32) దుర్మరణం పాలయ్యారు. స్కూటీపై వెళ్తున్న శివ ఇసుక ఎడ్ల బండిని ఢీకొట్టి అక్కడికక్కడే ప్రాణాలు వదిలేశాడు. దీనిపై శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన **వివరాల మేరకు..** నగరంలోని బలగ సమీపంలోని హడ్కో కాలనీకి చెందిన శివ రిమ్స్‌లో అసిస్టెంట్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. అతని తండ్రి రిమ్స్‌లోనే పని చేస్తూ మృతి చెందారు. అనంతరం శివ కూడా ఇక్కడే పనికి కుదిరాడు. భార్య శ్రీకళతో కలిసి నగరంలోనే నివాసం ఉండేవాడు. ఆమె కూడా అదే ఆస్పత్రిలో డెంటర్ విభాగంలో డీహెచ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి ఆస్పత్రి నుంచి పిలుపు రావడంతో శివ ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. రాత్రి పదిన్నర వరకు ఆస్పత్రిలోనే ఉన్నాడు. ఆస్పత్రిలో పని ముగియడంతో హైవేలో ఉన్న దాబా వద్ద భోజనం చేసి అటు నుంచి ఇంటికి వెళ్తానని సహచరులతో చెప్పి బయల్దేరాడు. ఆదివారం పేట చైతన్య స్కూల్ దాటి వెళ్తుండగా చీకటిలో రోడ్డుపై వెళ్తున్న ఇసుక ఎడ్ల బండి కనిపించకపోవడంతో అమాంతం దాన్ని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడం, నోరు, చెవుల నుంచి రక్తం కారడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు 108కు సమాచారం అందించగా వారు వచ్చి మృతదేహాన్ని రిమ్స్‌కు తీసుకెళ్లారు.

రాత్రనగా వెళ్లిన భర్త ఇంకా ఇంటికి రాకపోవడంతో శివ భార్య శ్రీకళ కంగారు పడ్డారు. భర్తకు ఫోన్ చేస్తుంటే లిఫ్ట్ చేయకపోతుండడంతో ఏం జరిగిందో తెలీక భయపడ్డారు. కాసేపటికే ఆ ఫోన్‌ను లిఫ్ట్ చేసిన అంబులెన్స్ డ్రైవర్ శివ మృతి వార్త చెప్పడంతో ఆమె దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే తన ఆడపడుచు ఇందిర, అతని భర్త మహేష్‌లతో కలిసి ఆస్పత్రికి వెళ్లారు. భర్త మృతదేహాన్ని చూసి ఆమె గుండెలవిసేలా రోదించారు. వీరికి ఇంకా సంతానం లేదు.

ఎడ్ల బండ్లతో ఇబ్బంది..

నగరంలో రాత్రిపూట ఎడ్లబళ్లపై కొందరు ఇసుక తరలిస్తున్నారు. జిల్లా కేంద్రానికి ఆనుకొని ఉన్న గ్రామీణ, పట్టణ సర్కిల్ పరిధిల్లోని చాలా ప్రాంతాల్లో నిత్యం వందలకు పైగా ఎడ్ల బళ్లను ఇసుకకు, చెరుకు గడల లోడింగ్‌కు రాత్రి సమయాన వాడుతుంటారు. వీరు ఇసుక తీసుకెళ్లవచ్చునని ప్రభుత్వం కూడా అనుమతి ఇచ్చింది. అయితే రాత్రిపూట చీకటిలో ఈ ఎడ్ల బండ్లు కనిపించక చాలా మంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ బళ్లకు రేడియం స్టిక్కర్లు, లైటింగ్ వంటివి ఉంటే ప్రమాదాలు జరగవని నిపుణులు సూచిస్తున్నారు. నగరంలోని హయాతినగరం, కిల్లిపాలెం, కొత్తపేట, పొన్నాడ, ఆమదాలవలస ఆర్చి రోడ్డు (తోటాడ పాయింటు), సతివాడ, కల్లేపల్లి, భైరి జంక్షన్ (నైర, గూడెం పాయింటు), పెద్దపాడు-రామలక్ష్మణ-డేఅండ్‌నైట్ మీదుగానే కాక పెద్దపాడు నుంచి హైవే మీదుగా కొత్తరోడ్డు నుంచి ఆమదాలవలస తోటాడకు, అదే కొత్తరోడ్డు నుంచి బలగ మీదుగా టౌన్‌లోకి ప్రతిరోజూ ఒక్కో ప్రాంతానికి 50 కు పైగా బళ్లు వెళ్తుంటాయని పోలీసులు చెబుతున్నారు. ఈ బండ్లు తోలేవారు కాస్త అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే

ఇసుక బళ్లు రాత్రి సమయాల్లో కొన్ని నిబంధనలు తప్పక పాటించాలి. ముఖ్యంగా రేడియం స్టిక్కర్లు బళ్లకు అంటించి, చార్జింగ్ లైట్లు వెంట తీసుకెళ్లాలి. ఆదివారంపేట జరిగిన ప్రమాదంలో ఎడ్లబండి వాడు రహదారి మార్జిన్‌లోకి రావడం, బండికి రేడియం స్టిక్కర్లు లేకపోవడం, చిమ్మచీకటి కావడంతో ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు ఢీకొట్టి మరణించాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం.

– విజయ్‌కుమార్, ఎస్ఐ, శ్రీకాకుళం రూరల్

ఆపస్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



డి.శివరామ్‌ప్రసాద్ | కె.సోమేశ్వరరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ నూతన అధ్యక్షునిగా దుప్పల శివరామ్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కీలు సోమేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘ జిల్లా కార్యాలయంలో జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. జిల్లా నూతన కార్యవర్గంలో మూడు ముఖ్యమైన పోస్టులకు ఎన్నికలను నిర్వహించి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శితోపాటు కోశాధికారిగా చలపాక రమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'జీఓ నంబర్ 117ను రద్దు చేయాలి'

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యారంగాన్ని నాశనం చేస్తున్న జీఓ 117ను వెంటనే ప్రభుత్వం రద్దుచేయాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పేడాడ ప్రభాకరరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని క్రాంతి భవన్‌లో ఆదివారం జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు పడాల తమ్మినాయుడు అధ్యక్షతన ఆ సంఘ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభాకరరావు మాట్లాడుతూ ఈ జీఓ తిరోగమనాన్ని సూచిస్తోందన్నారు.

• అర్ధ శతాబ్దం అనంతరం..



సోంపేట ఉన్నత పాఠశాలలో 1968-69, 69-70 వ సంవత్సరాల్లో చదువుకున్న వారు 54 ఏళ్ల అనంతరం పట్టణంలో ఆదివారం మళ్లీ కలుసుకున్నారు. అందరికీ 70 ఏళ్ల వయసు ఉంటుంది. 15 ఏళ్ల వయసులో తాము చేసిన అల్లరిని తలచుకుని వారంతా ఆనందంగా గడిపారు.

- సోంపేట

సీతారాముల కల్యాణానికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో నవంబర్ 9న నిర్వహించే సామూహిక శ్రీసీతారాముల కల్యాణ మహోత్సం నిర్వహణలో పాల్గొనే వలంటీర్లు, కార్యకర్తలు బాధ్యతగా నడుచుకోవాలని నారాయణ తిరుమల ఆలయ ప్రధాన అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు కోరారు. స్థానిక నారాయణ తిరుమల ఆలయ ప్రాంగణంలో వలంటీర్లతో సమావేశం ఆదివారం జరిగింది. కల్యాణానికి హాజరయ్యే దంపతులకు టోకెన్లు అందచేయాలని, ఆ టోకెన్లు తెచ్చివారిని మాత్రమే లోపలకు అనుమతించాలని సూచించారు. మగవారు తెలుపు రంగు, ఆడవారు ఆరెంజి రంగు సంప్రదాయ దుస్తులు ధరించేలా వారికి తెలియచేయాలని సూచించారు. కల్యాణంలో పాల్గొనే దంపతులు నవంబరు 2వ తేదీనుంచి దీక్షగా ప్రతి నిత్యం ఇంటివద్ద రెండుపూటలా దీపారాధన చేసే విధంగా వారికి సూచించాలని తెలిపారు. వారు ప్రతి రోజూ ముక్కలు లేని బియ్యంతో శ్రీరామ జపం చేయమని చెప్పాలని, అలా ప్రతి రోజూ చేసే బియ్యాన్ని మండపం వద్దకు ఇస్తే వాటిని స్వామివారి తలంబ్రాల కోసం వాడడం జరుగుతుందని శ్రీనివాసులు తెలిపారు. కల్యాణాన్ని బయట ప్రజలు వీక్షించే విధంగా ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలి వద్ద ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రామానుజ సేవాదళం సభ్యులు, వాలంటీర్లు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కొండలు.. కోనలు దాటి







ఒకటి కాదు రెండు కాదు 105 కిలోమీటర్ల మేర ప్రయాణించి, కొండలు కోనలు దాటి పలాస చేరుకున్న వంశ'ధార' ఇది. ఉద్దానంకు శుద్ధజలం అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన మంచినీటి ప్రాజెక్టుకు సంబంధించి ట్రయల్ రన్‌లు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఓవర్ ఫ్లో పాయింట్‌ల వద్ద నీరు బయటకు వస్తుండడంతో చూసిన వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈ ప్రాజెక్టు ప్రారంభం కానుంది.

- కాశీబుగ్గ

మద్యం మత్తులో వ్యక్తి మృతి?



మృతదేహాన్ని అంబులెన్సులో ఎక్కిస్తూ..

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని మారుతి థియేటర్ వద్ద ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్ తెలిపారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో థియేటరు కౌంటర్ పక్కన ఉన్న మెట్ల వద్ద ఓ వ్యక్తి పడిపోయి ఉండటాన్ని చూసిన సిబ్బంది వెళ్లి లేపగా లేచిన వ్యక్తి మళ్లీ అక్కడే పడుకున్నాడని, మళ్లీ ఆరుగంటల సమయంలో లేపగా లేవలేదని, దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. పోలీసులు వచ్చి పరిశీలించగా అతని జేబులో రూ. 1850 నగదు, టీవీఎస్ ఎక్సెల్ స్కూటీ తాళాలు, ఖైనీ ప్యాకెట్లు కనిపించాయని, చనిపోయి ఉన్నాడని చెప్పారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించామని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.